# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-01-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**2. తెలంగాణ ప్రభుత్వం సాగునీరు, విద్యా రంగాలకే తొలి ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

**3. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు.**

**4. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్.టి.రామారావు వర్ధంతి ఈరోజు.**

==========================

రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కాకినాడ సమీపంలో ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తో కలిసి ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ అమ్మోనియా.. భవిష్యత్తులో పెను మార్పులకు నాంధి కాబోతుందన్నారు. కాకినాడలో ఏర్పాటు చేయబోతున్న ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ అని చెప్పారు. 2027 జూన్ నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

..వాయిస్...30 సెకన్లు

-------------------------

తెలంగాణ ప్రభుత్వం సాగునీరు, విద్యా రంగాలకే తొలి ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి నిన్న భూమి పూజ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ఆయన ముచ్చటించి మాట్లాడుతూ...

...వాయిస్..30 సెకన్లు

-------------------------

రాష్ట్రంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టులపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది హంద్రీ – నీవా కాలువ వెడల్పు పనులను నిర్దేశించుకున్న గడువులోపు పూర్తి చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేశామన్నారు. అదే తరహాలో 2026లో వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాయలసీమలో ఉద్యాన రంగంలోని చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పూర్వోదయ పథకం, నల్లమల సాగర్ సహా వివిధ శాఖల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాల్సిన ప్రాజెక్టులు, జల్ జీవన్ మిషన్  పథకం వంటి అంశాలపై సమీక్షించారు.

---------------------------

అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం అమరావతి పనులు మళ్లీ వేగవంతం చేసినట్లు చెప్పారు. లేఅవుట్ల అభివృద్ధి, రహదారులు, సచివాలయం, శాసన సభ, మంత్రులు, ఐఏఎస్‌ల నివాసాలు,వరద నివారణ పనులను ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్‌ల నిధులతో చేపట్టినట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని తెలిపారు. అంతేకాకుండా.. విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లో టీసీఎస్, రిలయన్స్ వంటి సంస్థల పెట్టుబడులు పెట్టాయన్నారు.

---------------------------

వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారుల బృందం ఈ రోజు దావోస్ బయల్దేరి వెళ్లనుంది. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకూ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. ఈ రాత్రి విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి ముఖ్యమంత్రి బృందం ఢిల్లీ వెళుతుంది. అక్కడి నుంచి రేపు రాత్రి బయల్దేరి ఎల్లుండి ఉదయం జ్యూరిచ్‌కి చేరుకుంటుంది. జ్యూరిచ్‌లో పలువురు పారిశ్రామికవేత్తలతో  ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. అనంతరం భారత ఎంబసీ ఆధ్వర్యంలో హిల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి హాజరవుతారు. జ్యూరిచ్ నుంచి రోడ్డు మార్గాన దావోస్ కు వెళ్లనున్నారు.

---------------------------

పండుగ అనంతరం తిరుగు ప్రయాణమయ్యే ప్రయాణికుల నుంచి అధికంగా చార్జీలు వసూలు చేసే ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. విజయవాడ నుండి వివిధ నగరాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ అధికంగా ఛార్జీలు వసూలు చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు అధిక చార్జీల సమస్య ఎదురైతే టోల్ ఫ్రీ నంబరు 92816-07001ను సంప్రదించాలని సూచించారు.

---------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్.టి.రామారావు వర్ధంతి ఈరోజు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా నిమ్మకూరు గ్రామంలో 1923వ సంవత్సరం మే 28వ తేదీన జన్మించిన ఆయన... 1949లో చలనచిత్ర రంగంలో ప్రవేశించి, పలు సాంఘిక, జానపద, పౌరాణిక చిత్రాల్లో నటించి

ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. 1983 నుండి 1995 మధ్యకాలంలో మూడు పర్యాయాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించారు. తెలుగు భాష వినియోగానికి అహరహం పాటుపడిన ఎన్.టి.ఆర్.. 1996 జనవరి 18వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఒక ప్రముఖ చిత్రంలోని రామారావు గళాన్ని ఒకసారి విందాం...

వాయిస్ – 30 సెకన్లు

---------------------------

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు ఉన్నాయని పల్నాడు జిల్లాకు చెందిన రైతులు తెలియజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సేంద్రీయ ఎరువులతో సహజ వ్యవసాయం చేస్తూ ఒకవైపు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ.. ఆర్థికంగా లబ్ధి పొందుతున్నామంటున్నారు. రాబోయే కాలంలో స్థిరమైన వ్యవసాయాన్ని అందించాలన్న ఉద్దేశంతోనే ఎరువులు, రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయంపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లాలోని మాదిపాడు గ్రామానికి చెందిన రైతు నర్సింహారావు తెలియజేస్తూ...

వాయిస్ – 20 సెకన్లు

---------------------------

న్యూజిలాండ్ క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య నిర్వహిస్తున్న వన్ డే సిరీస్‌లో మూడవ మ్యాచ్ ఈ రోజు జరుగనుంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉన్న హోల్కర్ స్టేడియంలో మూడవ మ్యాచ్ ఈ మధ్యాహ్నం ఒంటి గంట 30 నిముషాలకు ప్రారంభమవుతుంది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇప్పటికే ఇరు జట్లు చెరొక మ్యాచ్ లో విజయం సాధించడంతో మూడవ మ్యాచ్ కీలకంగా మారింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొనడంతోపాటు, దట్టమైన పొగ మంచు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశము ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు పేర్కొన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతల్లో వచ్చే 5 రోజుల పాటు గణనీయమైన మార్పులు ఉండవని తెలిపారు.

మరోవైపు తెలంగాణలో రానున్న ఐదు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

=====================